ప్రజాశక్తి

గురువారం 23 జనవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విష్ణుకుమార్‌రాజు క్షమాపణ చెప్పాలి

విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి



నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల జెఎసి ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ కార్మికులపై తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం ఎదుట ఉన్న రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ ఎం.మన్మధరావు మాట్లాడుతూ, స్టీల్‌కార్మికులకు ఇష్టం లేకపోతే రిజైన్ చేసి, విఆర్ఎస్ తీసుకొని బయటకు పొండని విష్ణుకుమార్ రాజు పచ్చి కార్పొరేట్ల ప్రతినిధిగా కార్మిక వ్యతిరేకిగా మాట్లాడారన్నారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు నాడు కేంద్ర ప్రభుత్వం రూ.4890 కోట్లు పెట్టుబడి పెడితే, స్టీల్ ప్లాంటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇంతవరకు రూ.54 వేల కోట్ల ఆదాయం సమకూర్చిందన్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పాడి ఆవు లాంటిదని, మోడీ ప్రభుత్వం దీని అమ్మకం ఆపి సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులు కేటాయిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.వేలకోట్ల ఆదాయం సమకూరుస్తుందని, ప్రజల అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. ఈ పాడి ఆవును అదాని, మిట్టల్, పోస్కో వంటి కసాయిలకు కట్టబెట్టవద్దని ప్రజల డిమాండ్ అన్నారు. కేంద్ర ప్యాకేజీ కూటమి ప్రభుత్వం, డబుల్ ఇంజన్ సర్కారు వల్లనే వచ్చిందని, కార్మికులు, ప్రజల పోరాటం, సమ్మెల వల్ల కాదని విష్ణుకుమార్ రాజు చెప్పడం దుర్మార్గం అన్నారు. పోరాటమే లేకపోతే ఉక్కు పరిశ్రమ నిలిచి ఉండేదే కాదని, కేంద్రం దిగివచ్చేదే కాదన్నది జగమెరిగిన సత్యం అని చెప్పారు. ప్రజా ప్రతినిధిగా చిత్తశుద్ధితో వ్యవహరించి ప్రధాని చేత విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మే నిర్ణయాన్ని రద్దు చేయించాలని, సెయిల్‌లో విలీనం చేయించాలి, సొంత గనులు కేటాయించాలని, 8500 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, 5 వేల ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఆఫీసర్లు, పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికుల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని, విఆర్ఎస్, బదిలీలు పేరుతో ఆఫీసర్లు, పర్మినెంట్ కార్మికుల తగ్గింపు, టెండర్లు, 55 సంవత్సరాల వయసు, మెడికల్ నిబంధనలతో వేల సంఖ్యలో కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు

మిగతా 2లో..

జిల్లాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో అన్ని జిల్లాల అభివృద్ధికి ప్లానింగ్ బోర్డు చైర్మన్‌గా మంత్రులను నియమించి స్థానిక ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ముఖ్య నాయకుల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు కషి చేస్తున్నట్లు జిల్లా ఇన్చార్జి మంత్రి, భూగర్భ గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. అనకాపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఐదేళ్లలో జిడిపి పెంచుకోవడం, పెర్ క్యాపిట ఇన్‌కమ్ పెంచుకునేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు తెలిపారు. 26 జిల్లాల్లో అత్యధిక తలసరి ఆదాయం విశాఖపట్నం జిల్లాకు రాగా రెండో స్థానంలో అనకాపల్లి ఉందన్నారు. 15 శాతం గ్రోత్‌తో తీసుకెళ్తే దేశంలోనే ముందు ఉంటామన్నారు. పరిశ్రమలు, సేవలు, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషితో అనకాపల్లిలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు రూ.రెండు లక్షల కోట్లను ప్రధాని మోడీ మంజూరు చేశారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ, వనరుల సద్వినియోగం కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఏడాది జూన్ నాటికి అనకాపల్లికి నీరు అందించే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ ద్వారా రూ.151 కోట్లతో 1200 పనులు చేపట్టమని, అందులో ఇప్పటికే 60 శాతం పూర్తి అయినట్లు తెలిపారు. 25,800 ఇళ్లు మంజూరు చేశామని, అందులో 20 వేలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్యంగా పింఛన్లకు

మిగతా 2లో..

జివిఎంసి కమిషనర్‌కు ఆత్మీయ వీడ్కోలు



కమిషనర్‌ను సత్కరిస్తున్న మేయర్ తదితరులు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : బదిలీ అయిన జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్‌ను జివిఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆధ్వర్యాన సన్మానించారు. ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కమిషనర్‌గా సంపత్‌కుమార్ పరిపాలించిన కొద్ది కాలంలో ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నుంచి అన్ని విభాగాలనూ సమన్వయపరుస్తూ, ప్రతి అధికారికీ తగిన సూచనలు చేస్తూ, మౌలిక వసతులు కలపనే లక్ష్యంగా పనిచేశారని గుర్తుచేశారు. జివిఎంసి ఆదాయం పెంచేందుకు, పార్కుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణకు, ప్లాస్టిక్ నిర్మూలనకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు.

అనంతరం కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ, జివిఎంసిలో పనిచేసిన ఆరు నెలల కాలం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ప్రజాప్రతిథులు, అధికారులు, ఉద్యోగులు సహకరించారని తెలిపారు. సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, మురికివాడల ప్రజలకు, శ్రమజీవులకు, పేద ప్రజలకు కమిషనర్ పాలనలో ఎంతో మేలు జరిగిందన్నారు. సిపిఐ ఫ్లోర్ లీడర్ స్టాలిన్ మాట్లాడుతూ, జివిఎంసి అవసరాలు ప్రభుత్వ పరంగా సిడిఎంఎతో ముడిపడి ఉంటాయని, కార్మిక నాయకులుగా సమస్యలతో వస్తే పరిష్కార దిశగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, పలువురు కార్పొరేటర్లు, జివిఎంసి ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ జిల్లా గాజువాక నియోజకవర్గ పరిధి అగనంపూడి జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. గాజువాక నుంచి అగనంపూడి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మన్మధరావు (41), అరుణకుమారి (34)ని భారీ ట్రాలర్ ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలిద్దరూ ట్రాలర్ వెనుక చక్రాల కింద పడి నలిగిపోయి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించి మృతదేహాలను కెజిహెచ్‌కు తరలించారు. మన్మధరావు ఫార్మాసిటీలో ఉద్యోగం చేస్తున్నాడు. బ్యాంకు పని నిమిత్తం గాజువాక వెళ్లి తిరిగి అగనంపూడి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అగనంపూడి పరిధి డొంకాడలో వీరు అద్దెకు ఉంటున్నారు.

జెఎల్‌సి ఆదేశాలను సెవెన్ హిల్స్ అమలు చేయాలి

కార్మిక, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జాయింట్ లేబర్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యం అమలు చేయాలని, 38 మంది కార్మికులకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కార్మిక, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్‌చేసింది. టి.నూకరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశాఖ జిల్లా హాస్పటల్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.రాజు మాట్లాడుతూ, ఎంజిఎం సెవెన్ హిల్స్ ఆసుపత్రి యాజమాన్యం గత రెండేళ్లుగా కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, కార్మికుల బతుకులతో ఆటలాడుతుందన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి 38 మంది కార్మికులను చట్ట విరుద్ధంగా ఉద్యోగాల నుంచి తొలగించిందన్నారు. పండగ పూట వారంతా పస్తులతో గడపవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. గత రెండేళ్లుగా కార్మికులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం సమస్యను పరిష్కరించకుండా, దున్నపోతు మీద వర్షం కురిసిన చందంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. యాజమాన్యం చట్ట వ్యతిరేక చర్యలను అరికట్టి 38 మంది కార్మికులకు జీతాలు ఇప్పించాలని జాయింట్ లేబర్ కమిషనర్‌కు యూనియన్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జాయింట్ లేబర్ కమిషనర్ స్పందించి కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని రెండుసార్లు నోటీసు ఇచ్చినప్పటికీ యాజమాన్యం ఇంతవరకు ఆదేశాలను అమలు చేయలేదన్నారు 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులు యూనియన్‌గా ఏర్పడి ఆందోళన చేస్తుంటే, యూనియన్‌ను విచ్ఛిన్నం చేయడానికి కార్మికులను ఉద్యోగాల నుంచి హాస్పటల్ యాజమాన్యం తొలగించి వారి బతుకులతో ఆటలాడుకుంటుందని చెప్పారు. కార్మికులకు చట్టపరంగా రావలసిన బెనిఫిట్స్ ఎగ్గొట్టడానికి రికార్డులను తగలబెట్టి, అగ్ని ప్రమాదం జరిగిందని నాటకం ఆడుతోందన్నారు. 900 మంది ఉన్నప్పుడు కార్మికులను తొలగించాలంటే ప్రభుత్వం వద్ద అనుమతి పొందాలన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. అలా కాకుండా యాజమాన్యం ఏకపక్షంగా కార్మికులను దశలవారీగా బయటికి పంపాలని కుట్ర పన్నుతోందని తెలిపారు. కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఆకలి బాధలకు గురిచేసి వారిని లొంగదీసుకోవాలని చూస్తోందని విమర్శించారు. కార్మికులు ఐక్యంగా ఉంటూ యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారని చెప్పారు.

సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి మాట్లాడుతూ, సెవెన్ హిల్స్ హాస్పిటల్ భారత న్యాయ చట్టాలను అమలు చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కృష్ణ మోహన్ మాట్లాడుతూ ఈ నెల 24న సిఐటియు, ఇతర కార్మిక సంఘాల నాయకులతో కలిసి యాజమాన్యం వద్దకు వెళ్లి న్యాయంగా కార్మిక చట్టాలను అమలు పరచాలని కోరుదామని చెప్పారు. ఆయన సూచన మేరకు సమావేశం తీర్మానం ఆమోదించింది. స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, మత్స్యకారుల సంఘం నాయకులు కె.చంద్రశేఖర్, ఆటో యూనియన్ నాయకులు అప్పలరాజు, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు యు.రాజు, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రాజు

విశాఖ రెడ్ క్రాస్ షెల్టర్‌ను సందర్శించిన రూపామిశ్రా

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : పెదవాల్తేరు దళాయివారి వీధిలో జివిఎంసి ఆధ్వర్యాన నడుస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హోంలెస్ షెల్టర్‌ను గురువారం పలువురు అధికారులు సందర్శించారు. ఎన్‌యుఎల్‌ఎం (నేషనల్ అర్బన్ లైవ్ మిషన్) జాయింట్ సెక్రటరీ రూపా మిశ్రాతో పాటు అదే విభాగానికి చెందిన మౌగోల్మామ్, యుసిడి పీడీ సత్యవేణి, ఎపిడి రాము, జోనల్ కార్యాలయ సిబ్బంది షెల్టర్‌ను సందర్శించి పరిస్థితులపై ఆరా తీశారు. ఆశ్రయం పొందుతున్న వారితో మాట్లాడి, వివరాలనడిగి తెలుసుకున్నారు. షెల్టర్ నిర్వాహకులు మురళీ ఇక్కడి వివరాల్ని తెలియజేశారు.

22 వార్డులో పర్యటన

కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ రూపా మిశ్రా బుధవారం జివిఎంసి 22వ వార్డులో క్రీడా ప్రాంగణాలను, పార్కులను, షెల్టర్ ఫర్ అర్బన్ హోమ్లెస్ కేంద్రాన్ని, శివాజిపాలెం-4స్లమ్‌ను సందర్శించారు. అనంతరం పిఠాపురం కాలనీ పార్కు శివాజిపాలెం-4 స్లమ్ సమాఖ్య సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సమావేశంలో సమాఖ్య పనితీరును, సభ్యుల వ్యాపార, ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి యుసిడి ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి, కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, ఎపిడి రాము, సిఒ సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఎమ్మెల్సీ, వైసిపి మహిళా విభాగం అధ్యక్షులు వరుదు కల్యాణి ఆందోళన వ్యక్తం చేశారు. మద్దిలపాలెంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ భీమిలిలో ఇద్దరు బాలికలపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి సొంత జిల్లాలోనే మహిళకు భద్రత లేదన్నారు. మహిళలపై ఇటీవల జరిగిన దాడుల్లో 80 శాతం మద్యం మత్తులోనివేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో 50వేలకు పైగా బెల్ట్‌షాప్‌లు నడుస్తున్నాయని, హోం మంత్రి సొంత జిల్లా అనకాపల్లిలో విచ్చలవిడిగా గంజాయి లభిస్తుందని ఆరోపించారు. ముఖ్యమంత్రి నివాసముంటున్న గుంటూరు జిల్లాలోనే కొకైన్ లభించిందన్నారు. ఇలాంటి దారుణ పరిస్థితుల్లో మహిళల భద్రత ఎలా అని ఆమె ప్రశ్నించారు.

ఐదుగురిని విశాఖకు తీసుకొచ్చిన సిపి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విదేశాల్లో ఉద్యోగాలకు వెళ్లి మోసపోయిన ఐదుగురిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ సహకారంతో విశాఖపట్నం తీసుకొచ్చినట్లు నగర పోలీస్ కమిషనర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. షార్జాకు ఉద్యోగాల కోసం వెళ్లి అక్కడ మోసపోయిన ఉత్తరాంధ్ర యువకుడు నగర పోలీస్ కమిషనర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించడంతో అప్రమత్తమైన పోలీసులు ఐదుగురు బాధితులను కేంద్ర విదేశాంగ శాఖ సహకారంతో విశాఖ తీసుకువచ్చారు. వారికి బుధవారం మధ్యాహ్నం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాకు చెందిన పోలుపర్తి లక్ష్మీనారాయణ (21), గార రాజేష్ (21) పైల రామస్వామి (21), శ్రీకాకుళం జిల్లాకు చెందిన కాళ్ల వెంకట్రావు(25), విశాఖపట్నం జిల్లాకు చెందిన గెద్దాడ లోకేష్ (24) సంవత్సరం క్రితం గాజువాక శ్రీనగర్ ప్రాంతంలో ఉన్న విశాఖ వెల్డింగ్ ఇనిస్టిట్యూట్‌లో వెల్డింగ్ పనులు చేయడంలో శిక్షణ తీసుకున్నారని తెలిపారు. 2024 అక్టోబర్ నెలలో దుర్గారావు అలియాస్ ప్రసాద్, చందు ఏజెంట్ల ద్వారా మణికంట వెల్డింగ్ ఇనిస్టిట్యూట్ ఆటోనగర్ నుంచి దుబాయ్‌లోని షార్జా ప్రాంతంలో క్వాలిటీ ఇంటర్నేషనల్ కంపెనీలో పనిచేయడానికి ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. ఇంటర్వ్యూలు, వైద్య పరీక్షలు పూర్తయిన తర్వాత 2024 నవంబర్ 12న దుబాయ్ వెళ్లి షార్జాలో ఆ కంపెనీలో చేర్పించారని వివరించారు. అయితే ఏజెంట్లు ఆఫర్ చేసిన విధంగా వారికి ఉద్యోగం ఇవ్వకుండా వారిని బంధించడంతో విశాఖపట్నం జిల్లాకు చెందిన లోకేష్ తనను సంప్రదించాడని సిపి వివరించారు. వెంటనే తాను ఇమిగ్రేషన్ అధికారులతో చర్చించి వారికి విమాన టికెట్లు ఏర్పాటుచేసి బుధవారం దుబాయ్ నుంచి విశాఖపట్నం సురక్షితంగా తీసుకొచ్చినట్లు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

విష్ణుకుమార్‌రాజు క్షమాపణ చెప్పాలి

నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, కె.సత్యనారాయణ, ఎస్‌కె.రెహమాన్, సిఐటియు జిల్లా నాయకులు వి.కృష్ణారావు, ఒ.అప్పారావు, పి.పైడిరాజు, కెఎం.కుమారమంగళం, జి.అప్పలరాజు, నగిరెడ్డి రామారావు, సిఎఫ్‌టియుఐ నాయకులు ఎం.లక్ష్మి, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, బొట్టా ఈశ్వరమ్మ, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్‌కుమార్, బి.గణేష్, ఎస్.శ్రావణ్‌కుమార్, పి.సురేష్, కెవిపిఎస్ జిల్లా నాయకులు కె.పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు పీలా గోవింద సత్యనారాయణ, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్‌కుమార్, బత్తుల తాతయ్య బాబు, పివిజి కుమార్, మల్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఇన్స్యూరెన్స్ సొమ్మును అందిస్తున్న ఎస్‌బిఐ ప్రతినిధులు

ఎస్‌బిఐ ఇన్స్యూరెన్స్ అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో హోమ్ లోన్ తీసుకొని కొద్ది రోజులకే మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.96 లక్షల ఇన్స్యూరెన్స్ సొమ్మును స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా హోమ్ లోన్ సెంటర్-2 ఎజిఎం ఎస్.కామాక్షిప్రసాద్, చీఫ్ మేనేజర్ జీవన్ కుమార్ అందజేశారు. పెందుర్తిలో నివాసముంటున్న ఎల్లపు స్వామిశేఖర్ సొంత ఇల్లు కొనుక్కునేందుకు స్టేట్ బ్యాంకులో లోన్ తీసుకున్నారు. లోన్ తీసుకున్న సమయంలో బ్యాంకు సిబ్బంది సూచనల మేరకు సురక్ష ఇన్స్యూరెన్స్ కూడా చేయించుకున్నారు. లోన్ తీసుకున్న నాలుగు నెలలకే ప్రమాదవశాత్తు ఆయన మృతి చెందడంతో సుమారు 96 లక్షలు లోన్ అమౌంట్‌ను ఇన్స్యూరెన్స్ ద్వారా బాధిత కుటుంబానికి బ్యాంకు వారు అందజేశారు. ఈ సందర్భంగా స్వామి శేఖర్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, బ్యాంకు వారు ఎంతో సహాయం చేశారని కృతజ్ఞతలు తెలియజేశారు



అంబేద్కర్ -పూలే కేలండర్ ఆవిష్కరిస్తున్న ప్రణవ్‌గోపాల్

అంబేద్కర్ -పూలే కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రతి ఏటా మాదిరిగానే మనభూమి దినపత్రిక ప్రచురించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్-పూలే కేలండర్-2025ను విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆవిష్కరించారు. సిరిపురం జంక్షన్‌లోని విఎంఆర్‌డిఎ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ, అంబేద్కర్, పూలే, సావిత్రి బాయ్ పూలే లాంటి ఎందరో మహనీయులు కృషి ఫలితంగా సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం కోసం వారు చేసిన కృషి మరవలేనిదన్నారు. కార్యక్రమంలో ఎడిటర్ పి.సత్యనారాయణ, సీనియర్ సబ్ ఎడిటర్ ఎన్.శ్రీనివాసు పాల్గొన్నారు.

ఎపిటిడిసి ఎమ్‌డిని కలిసిన ప్రణవ్‌గోపాల్

ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలిని బుధవారం విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మొక్కలను బహూకరించారు.

గంటాను కలిసిన బిజెపి జిల్లా అధ్యక్షుడు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : బిజెపి విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన ఎంఎంఎన్.పరశు రామరాజు బుధవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షునిగా ఎంపికైనందుకు గంటాతో పాటు ఆయన తనయుడు, గంటా రవితేజలు పరశు రామరాజును అభినందించి సత్కరించారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, కూటమిని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఈ సందర్భంగా గంటా అన్నారు.

సర్వీస్ ప్రొవైడర్స్ మేళాకు స్పందన



మాట్లాడుతున్న పీడీ శ్రీరామ్

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి, మెప్మా, హోం ట్రయాంగిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆరిలోవ, తోటగరువు రాధాకృష్ణ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన సర్వీస్ ప్రొవైడర్స్ మేళాకు విశేష స్పందన లభించింది. జివింఎసి రెండోజోన్ పరిధిలోని 9 నుంచి 13 వార్డుల పరిధిలోని 126 మంది వివిధ వృత్తులకు చెందిన వారు శిక్షణకు దరఖాస్తు చేసున్నారు. ఈ సందర్భంగా రెండవ జోన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీరామ్ మాట్లాడుతూ సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ అనంతరం హోం ట్రయాంగిల్ సంస్థ యాప్ ద్వారా సర్వీస్ ప్రొవైడర్లను ఆన్ బోర్డ్ చేస్తామన్నారు. మొదటి దశలో వడ్రంగులు, ప్లంబింగ్, ఎసి, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, వాటర్ ప్యూరిఫైయర్, గీజర్ వంటి విద్యుత్ ఉపకరణాల సేవలను సర్వీస్ ప్రొవైడర్స్ అందిస్తారని, ఆయా సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 10వార్డు కార్పొరేటర్, మద్దిల రామలక్ష్మి, రాజశేఖర్, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఒమ్మి సన్యాసిరావు, 9వవార్డు ఇన్‌ఛార్జి, బుడుమూరు గోవింద్, వార్డు టిడిపి అధ్యక్షులు, గాడి సత్యం, గాడు అప్పలనాయుడు ఒమ్మి పోలారావు, ఎల్లమిల్లి సురేష్, తురకపూడి బాలస్వామి, మజ్జి రమణి, రాపర్తి గణపతి, జివిఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

రొయ్యల హేచరీల్లో ఆకస్మిక తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎంపెడా, టాస్క్‌ఫోర్స్ కమిటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగోవార్డు మంగమారిపేట, తిమ్మాపురం సమీపంలోని పలు హేచరీలను బుధవారం ఎంపెడా అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ నాయక్ ,డ్రగ్ ఇన్స్పెక్టర్ అభిప్రియ, ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు , మత్యశాఖ అభివద్ధి అధికారి లావణ్య తదితరులు ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హేచరీల్లో ఉన్న వసతులు, రొయ్య పిల్లల ఉత్పత్తి ప్రక్రియలో వాడుతున్న ప్రోబయోటిక్స్, ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, బ్రూడ్ స్టాక్‌లను పరిశీలించారు. వివిధ పరీక్షల నిమిత్తం పలు నమూనాలను ఎంపెడా అధికారులు సేకరించారు.ఆక్వా కల్చర్, అక్వా సంబంధిత యూనిట్లలో నిషేధిత యాంటీ బయోటిక్స్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో .జిల్లా కలెక్టర్, మత్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పలు హేచరీల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీ అకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఎఫ్‌డిఒ లావణ్య తెలిపారు.

గాజువాక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

రూ.1.50కోట్లతో పనులకు ఎమ్మెల్యే పల్లా శంకుస్థాపన

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జివిఎంసి 65వ వార్డులో రూ.1.50కోట్లతో ఎనిమిది అభివృద్ధి పనులకు సంజీవి కాలనీలో శంకుస్థాపన చేశారు అనంతరం వాంబే కాలనీలో పాత సామాజిక భవనాన్ని పూర్తి స్థాయిలో ఆధునీకరించే పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాల, అంగన్వాడీ భవనాల పరిస్థితిని ఎమ్మెల్యేకు కార్పొరేటర్ వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమం పరుగులెడుతోందన్నారు. ప్రజావసరాలే లక్ష్యంగా పనులు చేపడుతూ, నిధులను కేటాయిస్తున్నా మన్నారు. 65వ వార్డును ఆదర్శంగా తీర్చి దిద్దేందుకు తన వంతు పూర్తి సహకారం చేస్తానన్నారు. కార్యక్రమంలో జివింఎసి జోనల్ కమిషనర్ శేషాద్రి, ఇఇ అప్పారావు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, వార్డు టిడిపి అధ్యక్షుడు రట్టి వాసు, ఇంచార్జ బైపిల్లి గాంధీ, కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణ, జనసేన నేతలు రెయ్యి రత్నం, కృష్ణ, సుజాత, ఉమా పాల్గొన్నారు.



శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఆర్‌టిఒ జయప్రకాష్.

ప్రజాశక్తి -గాజువాక : రహదారి భద్రత అందరి బాధ్యత అని,గాజువాక ఆర్‌టిఒ జయప్రకాష్ అన్నారు రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం గాజువాక టిఎస్‌ఆర్ టిబికె కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌టిఒ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా చూస్తే రోడ్డు ప్రమాదాల సంఖ్య భారతదేశంలోనే ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్యార్థి దశ నుంచి రహదారి భద్రతపై అవగాహన కలిగి, వాటిని పాటించడంతోపాటు తోటివారిని పాటించేలా ప్రోత్సాహించం ద్వారా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు విద్యార్థులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ టి.ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

తోపుడు బళ్ల తొలగింపులో అత్యుత్సాహం

ప్రజాశక్తి- పెందుర్తి : నాయుడుతోట నుంచి పెందుర్తి వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న తోపుడుబళ్ల తొలగింపులో జివిఎంసి ట్రాఫిక్ సిబ్బంది అత్యుత్సాహం చూపుతున్నా రనే ఆరోపణలు వస్తున్నారు. రెండు రోజులుగా ఫుట్‌పాత్‌లపై తోపుడుబళ్లను తొలగిస్తుండగా, తమకు కనీసం ముందస్తు సమచారం ఇవ్వకుండా తొలగింపులు చేపడుతుండడంతో రూ.వేల విలువైన పండ్లు పాడౌతున్నాయని చిరువ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాక జివిఎంసి ట్రాఫిక్ సిబ్బంది అత్యుత్సాహం చూపడం వల్ల కొన్నిచోట్ల తోపుడు బళ్లు పాడైపోతున్నాయని, ఒక్కో బండికి రూ.పది వేల వరకు నష్టం వాటిల్లిందని తోపుడుబళ్ల కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. హాకర్‌జోన్ ఏర్పాటు చేస్తామని ఇన్నాళ్లుగా అధికారులు, నేతలు హామీలిస్తూ కాలయాపన చేస్తూ వస్తున్నారని, అదే ఏర్పాటైతే తమ వ్యాపారాలను అక్కడే చేసుకునే వారమని తోపుడుబళ్ల కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జివిఎంసి యంత్రాంగం, నేతలు దీనిపై దృష్టిపెట్టి, తమకు ప్రత్యామ్నాయం చూపాలని వీరంతా కోరుతున్నారు.

నేడు కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-గోపాలపట్నం : తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 23న గురువారం గోపాలపట్నం సుకన్య థియేటర్ వద్ద కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు తెలుగు యువత నేత పి.మౌర్యసింహ తెలిపారు. బుధవారం కబడ్డీ పోటీల పోస్టర్‌నుఆవిష్కరించారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నారిపిన్ని సత్తిరాజు, బొడ్డేటి విజయ్, యలమంచిలి ప్రసాద్, కబడ్డీ కమిటీ సభ్యుడు మోహనరావు, కోచ్ , పి.చైతన్య, తెలుగు యువత నేతలు దాడి సురేష్, అఖిల్ రంజిత్, అరుణ్ కుమార్, రొక్కం కొండలరావు, అలజంగి శ్రీను, హేమంత్ , వంశీ తదితరులు పాల్గొన్నారు

'మమ్మల్ని ఇంటికి పంపించేయండి'

ప్రజాశక్తి - ఆరిలోవ : తమను ఇంటికి పంపించేయాలంటూ ప్రభుత్వ ప్రత్యేక బాలికల గృహానికి చెందిన ఐదుగురు బాలికలు బుధవారం సాయంత్రం గోడ దూకేసి పరారీకి ప్రయత్నించారు. అడ్డు వచ్చిన సిబ్బందితో వాగ్వాదం, ఘర్షణ పడ్డారు. దీనిపై బాలికల హోం పర్యవేక్షణాధికారి సమాచారం మేరకు ఆరిలోవ పోలీసులు అక్కడికి చేరుకున్నా వారిపైనా తిరగబడ్డారు. విషయం తెలుసుకున్న ద్వారక ఎసిపి అన్నెపు నర్సింహమూర్తి, ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు, వుమెన్ అండ్ వెల్ఫేర్ పిడి జయదేవి చినగదిలి తహశీల్దారు పాల్ కిరణ్ అక్కడికి చేరుకుని, ఘటనపై వసతిగృహం పర్యవేక్షణాధికారిని అడిగి తెలుసుకున్నారు. పోలీసులు, అధికారులు వారికి కౌన్సిలింగ్ చేసి ఎట్టకేలకు గృహంలోకి తీసుకెళ్లడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఈ సందర్భంగా బాలికల గృహం పర్యవేక్షణాధికారి సునీత మాట్లాడుతూ, తమను ఇళ్లకు పంపించే యాలంటూ రెండురోజులుగా ఐదుగురు బాలికలు తిండిమానేసి సిబ్బందితో గొడవ పడుతున్నారన్నారు.

బుధవారం గోడ దూకి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారన్నారు. వీరిలో నలుగురి మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతో అధికారుల సూచనల మేరకు ఇప్పటికే ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స, కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వారిని మరోసారి మానసిక ఆసుపత్రికి తీసుకెళ్లాలని అధికారులు సూచించగా, దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలను ఇళ్లకు పంపించే వ్యవహారం కోర్టు పరిధిలో ఉంటుందని, దీనిపై ఉన్నతాధికారులు సూచనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

నేరాలు ఘోరాలు

హత్యాయత్నం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : అమ్మాయి విషయంలో ఇద్దరు యువకుల మధ్య తలెత్తిన వివాదం హత్యాయత్నానికి దారితీసింది. మాట్లాడుకుందామని పిలిచి ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడిచేసిన ఘటన ఎంవిపి పోలీసు స్టేషన్ పరిధిలో చోటచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మద్దిలపాలెం రామాలయం వీధిలో వినోద్ (22) ఓ గది అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. వినోద్ ఆర్‌టిసి.కాంప్లెక్స్‌లో పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తూ ఉంటాడు. మద్దిలపాలెం ఆర్‌టిసి డిపోలో ఉన్న ఓ టిఫిన్ పార్లర్‌లో పని చేస్తున్న శ్రీదేవి (20)ని వినోద్ ప్రేమిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన వెంకట్ కూడా ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఆ అమ్మాయి విషయంలో ఇద్దరు యువకుల మధ్య వివాదం నెలకొంది. ఇద్దరి మధ్య ఫోన్‌లో మాటామాటా పెరిగి శతృత్వం ఏర్పడింది. మాట్లాడుకుని వివాదాన్ని పరిష్కరించుకుందామని చెప్పి ఇద్దరు యువకులు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే వినోద్‌కు వెంకట్ ఫోన్ చేసి మద్దిలపాలెం రావాలని పిలిచాడు. కలిసిన తర్వాత ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. దీంతో తనవెంట తెచ్చుకున్న కత్తితో వినోద్ కడుపులో కత్తితో పొడిచి వెంకట్ పరారయ్యాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి వినోద్‌ను చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఎంవిపి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

31 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - కొత్తకోట : కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో టి.అర్జాపురం శివారు డోలవాణిపాలెం గ్రామంలో మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 31 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. బుధవారం డోలవానిపాలెం గ్రామంలో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామని ఎస్సై తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పంగిడి గ్రామ శివారులో కోడి పందేలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు బుధవారం దాడి చేశారు. అక్కడ కోడిపందాలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద రెండు కోడిపుంజులు, రూ.1110 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏ.శ్రీనివాసరావు తెలిపారు.

'మంతెన'కు సత్కారం

ప్రజాశక్తి- పద్మనాభం : బిజెపి జిల్లా అధ్యక్షునిగా నియమితులైన మంతెన మురళీనాగ పరశురాము రాజును మండల పార్టీ అధ్యక్షురాలు తమటపు నాగమణి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పూలమాల వేసి దుశ్శాలువాతో సత్కరించారు. పార్టీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ మండల మాజీ అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, నాయకులు మత్స సోమేశ్వరరావు, సిరిపురపు వెంకటరావు పాల్గొన్నారు.

ఆహార నాణ్యత, శుభ్రత పెంచాలి

- అన్నా క్యాంటీన్ సందర్శనలో ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -మధురవాడ : అన్నాక్యాంటీన్లలో ఆహార నాణ్యత, శుభ్రతను పెంచాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. బుధవారం జివిఎంసి ఐదో వార్డు మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీలోని అన్నక్యాంటీన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్థానికులతో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా అన్నా క్యాంటీన్‌లో సాయంత్రం వేళ గంజాయి, మందుబాబుతో ఇబ్బందిగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే గంటా దృష్టికి తేగా, దీనిపై తగు చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. టిడిపి నేత నమ్మి రమణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హిందీ పరీక్షలో ప్రతిభ

ప్రజాశక్తి పద్మనాభం : రాష్ట్రస్థాయి హిందీ ప్రతిభ పరీక్షల్లో మండలంలోని కృష్ణాపురం కెజిబివి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ గ్రేసీ లిల్లీ అన్నారు. కృష్ణాపురం కస్తూర్బా పాఠశాల హిందీ టీచర్ ఎన్.కోమలి సహకారంతో వీరంతా మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మెరిట్ సర్టిఫికేట్‌లతో పాటు ఐదు బంగారు, ఏడు వెండి పతకాలను సాధించారన్నారు. డిఇఒ ఎన్.ప్రేమకుమార్, ఎపిసి జె.చంద్రశేఖర్, జిసిడిఒ ఖలీసా బేగం తమ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

కల్వర్టు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపి భరత్, ఎమ్మెల్యే వెలగపూడి,సిపి బాగ్చీ

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు, విమ్స్ ఆవరణలో కొత్తగా నిర్మించిన ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళేందుకు బాక్స్ కల్వర్టు పనులకు బుధవార ఎంపి ఎం.శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు జివిఎంసి నిధులు రూ. 60 లక్షల వ్యయంతో బిఆర్‌టిఎస్ రోడ్డు నుంచి ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళే మార్గంలో బాక్స్ కల్వర్టును నిర్మించనున్నారు. కార్యక్రమంలో, రెండవ జోన్ కమిషనర్ ఫణిరామ్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, డిసిపి అజిత, ఎసిపి అన్నెపు నర్సింహమూర్తి, సిఐ మల్లేశ్వరరావు, జివిఎంసి డిఇఇ అప్పారావు, ఎఇఇ వెంకటరావు, టిడిపి నాయకులు ఒమ్మి సన్యాసిరావు, మద్దిల రాజశేఖర్, బలగ సుధాకర్, బుడుమూరు గోవిందు, మూది అప్పారావు, ఒమ్మి పోలారావు, ముగడ రాజారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జెడ్‌సి ప్రేమ ప్రసన్నవాణి

ప్రజాశక్తి -భీమునిపట్నం :బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జెడ్‌సి పిల్లి ప్రేమ ప్రసన్నవాణి అన్నారు.బుధవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో కిశోరి వికాసం మండల స్థాయి సమావేశంలో మాట్లాడుతూ, బాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, బాల్య వివాహాల అనర్థాలను వివరించారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి మాట్లాడుతూ,కిశోరబాలికలు సమాజంలో ముందడుగు వేసేందుకు ప్రేరణ ఇచ్చేలా ఈ తరహా శిక్షణ దోహద పడుతుందన్నారు. ఎంపిడిఒఎన్ హనుమంతరావు మాట్లాడుతూ, కౌమారదశ పరిణామ క్రమాన్ని వివరించారు.ఎంఇఒ ఎం.శివరాణి మాట్లాడుతూ, పిల్లలకు పోషకాహార అవసరాన్ని వివరించారు. సిడిపిఒ ఎం శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నేర విభాగం ఎస్ఐ సూర్య ప్రకాశరావు, డాక్టర్ కల్యాణి, చిట్టివలస జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం పొట్నూరు మురళీ మోహనరావు మాట్లాడారు. శిక్షణలో ఎఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

చురుగ్గా గంధవరం రింగ్ రోడ్డు పనులు



గ్రావెల్ రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న ఎంపిటిసి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని గంధవరం గ్రామంలో ఎంపిటిసి రమణరాజు ఆధ్వర్యంలో రింగ్ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పల్లెపండుగ కార్యక్రమాల్లో భాగంగా గ్రామానికి రూ.12 లక్షల నిధులు మంజూరుకాగా, ఆ నిధులతో రింగ్ రోడ్డు పనులను వారం రోజులుగా చేపడుతున్నారు. ముందుగా గ్రావెల్ రోడ్డును వేసి, తర్వాత సిసి రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఎంపిటిసి తెలిపారు.

పద్మనాభరావు మరణం తీరని లోటు

కుటుంబ సభ్యులను పరామర్శించిన సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు



పద్మనాభరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి-పెందుర్తి :షిప్‌యార్డ్ మాజీ ఉద్యోగి, సిపిఎం సభ్యులు వనమాలి పద్మనాభరావు మరణం ఆయన కుటుంబానికే కాక కష్టజీవుల ఉద్యమాన్నికి తీరనిలోటని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు అన్నారు. మంగళవారం పద్మనాభరావు మృతి చెందారు. బుధవారం పెందుర్తి చిన ముషిడివాడ శ్రమశక్తినగర్ లోని పద్మనాభరావు కుటుంబాన్ని జగ్గునాయుడు పరామర్శించారు. పద్మనాభరావు లక్ష్మి దంపతుల కుమార్తెలు విశాలి, విజయ, కుమారుడు శ్రీనివాసరావు, సోదరుడు సూర్యారావులను పరామర్శించిన జగ్గునాయుడు, పద్మనాభరావు, లక్ష్మీలు ప్రజా ఉద్యమంలో చేసిన కృషిని, అతనితో తమకున్న అనుబంధాన్ని కుటుంబ సభ్యులతో జగ్గు నాయుడు పంచుకున్నారు. పార్టీ విశాఖ జిల్లా కమిటీ తరపున తమ సంతాపాన్ని సానుభూతిని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఎరక్షన్ డిపార్ట్మెంట్లో ఎరక్టర్‌గా, షిప్‌యార్డ్ ట్రైనింగ్ స్కూల్లో ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహించిన పద్మనాభరావు, . మాస్టర్‌గా గుర్తింపు పొందారు. సిపిఎం సభ్యునిగా, సిఐటియు నాయకునిగా షిప్‌యార్డులోనూ, మల్కాపురం జోన్ పరిధిలోను సేవలందించారు. సౌమ్యులు, నీతి నిజాయితీ నిబద్ధతగల పద్మనాభరావు పలువురికి ఆదర్శంగా నిలిచారు. తనతోపాటు తన భార్య లక్ష్మిని కూడా ఉద్యమంలో భాగస్వాములను చేశారు. 50వ వార్డు కార్పొరేటర్‌గా సిపిఎం తరపున పోటీ చేసిన లక్ష్మి, మహిళా సంఘం మల్కాపురం జోన్ నాయకురాలిగా వ్యవహరించారు.

ప్రజా భాగస్వామ్యంతో చెరువుల పరిరక్షణ

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



చెరువు పనుల ప్రారంభోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే,కలెక్టర్

ప్రజాశక్తి -భీమునిపట్నం : చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత అని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు బుధవారం జివిఎంసి నాలుగో వార్డు కాపులుప్పాడలో ధాన్ ఫౌండేషన్, విఎంఆర్‌డిఎ, జివిఎంసి సంయుక్త ఆధ్వర్యంలో సిఎఎస్‌సిఎడి పథకం ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే గంటా మాట్లాడారు. పెరుగుతున్న పట్టణీకరణ ప్రభావంతో అనేక చెరువులు కనుమరుగవుతున్నా యన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు ప్రజల భాగస్వామ్యంతో చెరువు గర్భాలను రక్షించుకోవడం సాధ్యమవుతుం దన్నారు. పునరుజ్జీవంతో పాటు చెరువు సుందరీకరణ ద్వారా కాపులుప్పాడ చెరువును ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు, విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్, కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్, విఎంఆర్‌డిఎ చైర్మన్ కెఎస్.విశ్వనాథన్, ఆయిల్ సీడ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జీతో కలిసి కాపులుప్పాడ చెరువును ఎమ్మెల్యే గంటా పరిశీలించారు.

ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో పిల్లలకు ప్రత్యేక వార్డు



పిల్లల ప్రత్యేకవార్డు ప్రారంభిస్తున్న సీతారాం

ప్రజాశక్తి- సీతమ్మధార : రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలతో నగరంలోని రెడ్డం సూర్య ప్రసాదరావు ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఒపి చీటీలు రాసే కేంద్రం, వైద్యపరీక్షల గది, ఆరు బెడ్‌లతో పిల్లల ప్రత్యేక వార్డును బుధవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ప్రారంభించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా అన్ని జిల్లాల ప్రధాన ఆసుపత్రుల్లో ప్రత్యేక ఒపిలు, ప్రత్యేక వార్డులు నెలకొల్పాలన్నది లక్ష్యమని, అందులో భాగంగానే గతనెలలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సూచనల మేరకు ప్రాంతీయ నేత్రవైద్యశాలలో పిల్లలకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మిగతా ఆసుపత్రులతోపాటు అన్ని జిల్లాల్లోనూ బాలలకు ప్రత్యేక వైద్యవిభాగాలను ఏర్పాటుకు కమిషన్ కృషి చేస్తుందన్నారు. నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన ప్రత్యేక వార్డులో వైద్యసేవలను, మరిన్ని మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి వచ్చే పిల్లలకు మెరుగైన నేత్ర వైద్యసేవలు అందించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి పిఎంఒ ఒ..ఉమా శ్రీనివాస్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణ కుమారి, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు, చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం జిల్లా ప్రతినిధులు కె.ఎల్లయ్య, ఎం.హరీష్ కుమార్ పాల్గొన్నారు.

80 మంది గీతం ఎంబిఎ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు 80 మంది ప్రముఖ కార్పొరేట్ సంస్థలలో భారీ వేతనంతో ఉద్యోగాలను సాధించారు. పలువురికి రూ.11 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు వచ్చాయని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ వంశీకిరణ్ సోమయాజుల తెలిపారు డెలాయిట్, రిలయన్స్ బిపి మొబిలిటి లిమిటెడ్, బెర్కాడియా బిఎన్ఎమ్ సొల్యూషన్స్, ఎక్సెంచూర్, విప్రో, బజాజ్ ఎలక్ట్రికల్స్, టివిఎస్ మోటార్స్, ఒరాకిల్, ఎడిపి, ఫ్రైస్ వాటర్ కూపర్, కాల్గేట్ పామోలివ్, గ్రాసిమ్ వంటి . ప్రముఖ సంస్థలు ప్రాంగణ నియామకాలను నిర్వహించాయన్నారు. తెలిపారు. రానున్న రోజులలో మరికొన్ని కార్పొరేట్ కంపెనీలు ప్రాంగణ నియామకాలను జరపనున్నాయన్నారు. విద్యార్థులకు ప్రణాళికయుతంగా శిక్షణ ఇవ్వడం, కార్పొరేట్ రంగం నిపుణులతో చర్చా కార్యక్రమాలు నిర్వహించడం ప్రాంగణ నియామకాలలో విద్యార్థులు విజయానికి దోహపడ్డాయని గీతం కెరీర్ ఫుల్‌ఫిల్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.వి.సంధ్యారాణి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా.పి.పప్పు అభినందించారు.

పుస్తక పఠనంతో ప్రయోజనం



పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న గీతం అధికారులు

ప్రజాశక్తి -మధురవాడ : సాంకేతికంగా ఎంత పురోభివృద్ధి సాధించినా, పుస్తకానికున్న ప్రాధాన్యత సుస్థిరమని, విద్యార్థి దశలో పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవడం వారిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళు తుందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ అన్నారు. బుధవారం గీతం నాలెడ్జి రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు ఈ సందర్భంగా విద్యార్థులలో పఠనాసక్తిని పెంచడానికి పుస్తక ప్రదర్శన దోహదపడుతుందన్నారు. గీతం గ్రంథాలయ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌పి. బాలసుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు ఉపయోగపడేలా దేశంలోని ప్రముఖ ప్రచురణకర్తలతో రెండురోజుల పాటు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోందని, ఇకపై ఏటా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. పుస్తక ప్రదర్శనలో ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, కంప్యూటర్ సైన్స్, మేనేజ్‌మెంట్, వైద్య రంగాలకు చెందిన గ్రంథాలను అందుబాటులో ఉంచారు. తాము చదువుతున్న కోర్సులలో నూతన అంశాలపై గ్రంథాలను సహితం పుస్తక ప్రదర్శనలో అందుబాటులో ఉంచడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. గీతం గ్రంథాలయ అధికారి డాక్టర్ శివ ప్రసాద్ పండా ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి- ములగాడ: జివిఎంసి 59వ వార్డు పారిశ్రామిక ప్రాంతంలోని పునర్నిర్మించిన లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాల కొత్త భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబు బుధవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.60లక్షలతో శిథిలావస్థకు చేరుకున్న లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పునర్నిర్మించి, ఆధునీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సిహెచ్ రామ్మోహన్‌నాయుడు, జనసేన ఇన్‌ఛార్జి అంగ దుర్గాప్రశాంతి, టిఎన్‌టియుసి అధ్యక్షులు నక్క లక్ష్మణరావు, 59వ వార్డు జనసేన నాయకులు పుర్రె సురేష్, వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ, కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస: భీమిలి మండలం తాటితూరు జెడ్‌పి హైస్కూల్లో 1995 -96 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరిని మరొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులను సత్కరించారు.

రూపు కోల్పోయిన బిఎన్ రోడ్డు!

- నిండాగోతులతో రాకపోకలకు ఇక్కట్లు
- మట్టిరోడ్డులా మారినా పట్టని అధికారులు
- తరచూ ప్రమాదాలతో వాహనదారుల బెంబేలు



మట్టిరోడ్డులా తయారైన చోడవరం- వడ్డాది మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి- చోడవరం

సంక్రాంతి నాటికి గతుకుల రోడ్డు కనిపించకుండా చర్యలు చేపట్టాలని సిఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం స్పష్టం చేసినా, భీమునిపట్నం, నర్సీపట్నం ఆర్అండ్బి రహదారిలో దుస్థితిలో ఇసుమంతైనా మార్పులేదు. నిండా గోతులతో, తారు మొత్తం చెదిరిపోయి, మట్టిరోడ్డులా మారి ప్రయాణసంకటంగా మారిన ఈ రహదారిని పట్టించుకునే నాథులే లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారి, ఎందరో బైకిస్టులు క్షతగాత్రులవుతున్నా పాలకులు పట్టించుకున్న పాపాన్ని పోలేదు రోడ్లను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి నాయకులు, తాము అధికారంలోకి వస్తే రోడ్లన్నీ బాగుచేస్తామని హామీనిచ్చారు. దానికి కొనసాగింపుగా సంక్రాంతి నాటికి రహదారుల్లో గోతులు ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అయితే ఇవేవీ బిఎన్ రోడ్డులో అమలు కావడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా, ఈ మార్గంలో కనీసం కొత్త రోడ్డు వేయలేదు సరికదా, కనీసం గుంతలైనా పూడ్చలేదని పలువురు విమర్శిస్తున్నారు.

చోడవరం, వడ్డాది మధ్య రహదారిలో భారీగా గుంతలు ఏర్పడడంతో గత వైసిపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు కొంత ధనాన్ని వెచ్చించి చోడవరం, వడ్డాది, గోవాడ, విజయరామరాజుపేట వద్ద పెద్ద గుంతలను పూడ్చారు. నరసయ్యపేట బ్రిడ్జి నుండి చోడవరం హైస్కూల్ వరకు తారు రోడ్డు పునర్నిర్మించారు. ఇది తాత్కాలిక ఉపశమనం కలిగించినా, తర్వాత కురిసిన వర్షాలకు ఇపుడు రోడ్డు మొత్తం గుంతలు ఏర్పడి ఏకంగా రూపే కోల్పోయి మట్టిరోడ్డులా దర్శనమిస్తోంది. నిత్యం వందలాది వాహనాలు తిరిగే రహదారిలో గుంతలతో పాటు మట్టి రోడ్డుగా మారడంతో వాహనాలు ప్రయాణించేటప్పుడు దుమ్మురేగి, ఇబ్బందులు పడుతున్నారు. గుంతల రోడ్లకు సంక్రాంతి నాటికి మరమ్మతులు చేస్తామని కూటమి పాలకులు ప్రకటించినా, అవేవీ బిఎన్రోడ్డుకు వర్తించలేదు. ఈ రోడ్డును వంద అడుగులకు వెడల్పు చేస్తామని కూటమి నేతలు వాగ్దానాలు చేస్తూనే ఉన్నారు. విస్తరణ మాట దేవుడెరుగు, కనీసం గుంతలైనా పూడ్చాలంటూ ప్రయాణికులు మొరపెట్టుకుంటున్నారు. రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని ఇప్పటికే సిపిఎం, సిపిఐ, వివిధ ప్రజాసంఘాలు ఆందోళన చేపట్టినా, ప్రభుత్వం, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.



మాట్లాడుతున్న రైతు నాయకులు కర్రి అప్పారావు తదితరులు

26న నిరసన ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్లో జరుగు నిరసన ర్యాలీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని రైతు నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక భవన్లో బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా భాగస్వామ్య సంఘాల సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, ప్రజలు విస్తృతంగా పాల్గొవాలని పిలుపునిచ్చారు. స్థానికంగా ఉన్న వ్యవసాయాధారిత పరిశ్రమలైన సుగర్ ఫ్యాక్టరీలను కాపాడాలని, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలో జరుగుతున్న అక్రమాలపై తగిన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్కెయం జిల్లా కన్వీనర్, ఎపి రైతు సంఘం జిల్లా కర్రి అప్పారావు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు గాడి బాలు, రైతు కూలీసంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్రావు, రైతు సంఘం నాయకులు గండి నాయన బాబు, తేలయ్య బాబు, ప్రజా రాజకీయ వేదిక నాయకులు కనిశెట్టి సురేష్ బాబు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని వెంకుపాలెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 12 గంటల లోపే వారి ఖాతాలకు సొమ్ము జమ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులను సన్మానించారు. అనంతరం గ్రామంలో శ్మశాన వాటికకు నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రీ బాబి, కూటమి పార్టీల నాయకులు చిరంజీవి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




కలెక్టర్కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

ఆర్ఇసిఎస్ పర్సన్ ఇన్ఛార్జిగా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్ఈసిఎస్) లిమిటెడ్ కశింకోట పర్సన్ ఇన్ఛార్జిగా కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ ఫర్ కోఆపరేషన్ అండ్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ శాఖ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం అనకాపల్లి జిల్లా కలెక్టర్ను అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్ఈసిఎస్) కసింకోటకు అధికారిక పర్సన్ ఇన్ఛార్జిగా కలెక్టర్ను నియమిస్తూ వ్యవసాయం, సహకార శాఖ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అడిట్ అధికారి ఎం.శ్యామల, ఆర్ఈసిఎస్ ప్రాజెక్ట్ ఇంజనీర్ జె.ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఆర్లే పంచాయతీ శివారు చింతపాలెం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు బుధవారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. చింతపాలెం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ లక్ష్మి, సబ్బవరపు రామకృష్ణ, చిరికి ప్రసాద్, సబ్బవరపు పైడంనాయుడు, బోలెం కోటేశ్వరరావు, శీరంరెడ్డి దేముడు, సబ్బవరపు అప్పలనాయుడు తదితరులకు ఎమ్మెల్యే బండారు పార్టీ కండువాలు వేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ ఆరు నెలల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరు నచ్చి వైసిపి నుండి టిడిపిలో చేరడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, నాయకులు సబ్బవరపు రామునాయుడు, దోకల నరసింహమూర్తి, జూరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బండారు సమక్షంలో టిడిపి చేరిన నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన టెన్త్ నమూనా పరీక్ష



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నమూనా పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణంలో 10వ తరగతి విద్యార్థులకు నమూనా పరీక్ష బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షల పట్ల భయాందోళన పోగొట్టాలని, కాంపిటేటివ్ పద్ధతిని అలవాటు చేయాలని, వారిలో ఉన్న ప్రతిభ వెలికి తీయడానికి ఈ నమూనా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఈ పరీక్షను నిర్వహించడం జరిగిందన్నారు. పది రోజుల్లో ఫలితాలు వెల్లడించి వారిలో మొదటి 15 మందికి బహుమతుల ప్రదానం చేస్తామని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యంచాలని చెడువ్యసనాలకు అలవాటు పడకుండా ఉండడానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. మండల కార్యదర్శి ఎం.నూకరాజు మాట్లాడుతూ పరీక్షలంటే విద్యార్థులు భయపడుతున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, పరీక్షలు, ఫలితాలు పట్ల భయం పోగొట్టడానికి ఇటువంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షల్లో అనకాపల్లి పట్టణంలో సుమారుగా 550 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎం.వినయ్, నాయకులు రాజు, సింహాద్రి, కృప పాల్గొన్నారు.

యలమంచిలిలో స్వీపింగ్ మెషిన్ సేవలు

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి ప్రధాన రోడ్లపై పేరుకుపోతున్న 'ధూళి' చెలరేగకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచడానికి కొత్తగా మున్సిపాలిటీ 'స్వీపింగ్ మెషిన్' సమకూర్చుకుంది. మట్టి రోడ్లపై పేరుకుపోయి వాహనాల రాకపోకల సందర్భంలో ఎగిరిపడి వాహన చోదకులకు ప్రమాదం కలిగిస్తుంటాయి. దాన్ని గుర్తించిన ప్రభుత్వం మున్సిపాలిటీలకు 'స్వంచ్ఛ-ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా 850 హార్స్పవర్ డీజిల్ మెషిన్ ఏర్పాటు చేసింది. దాదాపు రూ.18 లక్షలు విలువ చేసే స్వీపింగ్ మెషీన్ నడపడానికి ట్రైనింగ్ అనంతరం బుధవారం నుండి రెండు రోజులు పాటు ట్రైల్ రన్ చేపట్టారు. ఈ స్వీపింగ్ మెషీన్ నిర్వహణకు గంటకు 3 లీటర్ల డీజిల్ వినియోగించాల్సి ఉంటుందని శానిటరీ ఇనస్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తెలిపారు. డివైడర్లున్న రోడ్లలో పేరుకు పోయిన ధూళిని నిర్మూలించడానికి బాగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఇప్పటికే రైల్వే స్టేషన్ రోడ్డు, హైవే సమీపంలోని రైల్ ఓవర్ బ్రిడ్జి రోడ్డు శుభ్రం చేసినట్లు ఆయన వివరించారు.



ధూళిని స్వీపింగ్ మెషిన్ ద్వారా తొలగిస్తున్న దృశ్యం

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-కశింకోట : ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని తీడ గ్రామంలో రీ సర్వేపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మహిళా రైతులు తమ భూ సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల భూములను కాపాడేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామన్నారు రైతులు రీ సర్వేను సద్వినియోగం చేసుకొని భూ రికార్డులను సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, కాయల మురళి, వేగి గోపికృష్ణ, నైనముశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, కర్రి సత్యనారాయణ, దాడి నాగరాజు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొణతాలకు తమ గోడు చెబుతున్న మహిళా రైతులు

నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.38.63 లక్షల వ్యయంతో చేపట్టిన స్థానిక జడ్పీ హైస్కూల్ ప్రహరీ నిర్మాణ పనులు సకాలంలో ప్రారంభించి, నాణ్యతతో పూర్తి చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. బుధవారం ఆయన స్థానిక జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి ప్రాంగణంలో ఉన్న బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. జడ్పీ హైస్కూల్ ప్రహరీ నిర్మించనున్న స్థలాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బలక్ష్మి, స్కూల్ హెచ్ఎం పద్మావతి, ఎంఇఒలు కూనిరెడ్డి సత్యనారాయణ, డివిడి.ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, నాయకులు కన్నూరు సూర్యనారాయణ, దోకల నరసింహమూర్తి, భూపతి అప్పలరాజు, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, పూడి నారాయణమూర్తి, దాడి ఎరుకునాయుడు, బొడ్డు అక్కునాయుడు, వెలగల పైడంనాయుడు, యడ్ల రమేష్, వంటాకు శీను, దొగ్గ ఉమాశంకర్, రెడ్డి రామస్వామి, జోగ కుల్లోడు పాల్గొన్నారు.

'ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్‌'పై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ఇస్తున్న ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్‌పై అవగాహన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం మొదటి రోజున 100 మంది పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి పారిశ్రామిక వేత్తలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్ గోవిందరావు, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజారావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి దళిత సేవా సంఘం సభ్యుడు తాడి సామాలు తల్లి వీరమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి సంఘం సభ్యులు బుధవారం ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. సంఘం ఏర్పాటు చేసిన దగ్గర నుంచి ఇప్పటి వరకు సుమారు 11 కుటుంబాలకు ఆర్థిక సాయం అందించినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తాడి కాళిదాసు, ఉపాధ్యక్షులు పొట్టేల గణేష్, కార్యదర్శి రొప్పల కొండబాబు, సహ కార్యదర్శి తాడి ఎర్నిబాబు, కోశాధికారి సున్నపు నాగరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-సబ్బవరం : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు ఈ నెల 23న మండలంలోని ఇరువాడ దరి జివిఎస్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు టిడిపి పెందుర్తి నియోజకవర్గ ఇంచార్జి గండి బాబ్జి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని టిడిపి, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సాయంత్రం 6గంటల నుండి విందు భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఘనంగా పీలా శ్రీకాంత్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తనయుడు డాక్టర్ పీలా శ్రీకాంత్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో తెలుగు యువత సభ్యులు, అభిమానులు రోగులకు, గర్భిణులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. అనంతకు ముందు పెందుర్తిలోని ఆయన స్వగృహంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొద్దపు ప్రసాద్, పోలవరపు త్రినాథ్ పాల్గొన్నారు.

కశింకోట : పీలా గోవింద సత్యనారాయణ తనయుడు డాక్టర్ పీలా శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి డైరెక్టర్ ఉల్లింగల రమేష్ ఆధ్వర్యంలో తాళ్లపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, గర్భిణులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అచ్చర గ్రామ టిడిపి అధ్యక్షులు నైనముశెట్టి రమణరావు, నక్క సాయి, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ చలనచిత్ర నటులు అక్కినేని నాగేశ్వరరావు పదవ వర్ధంతి సందర్భంగా సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక చినరాజుపేట తమ సంస్థ కార్యాలయంలో అనకాపల్లి మండలం వెంకుపాలెం హృదయశాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధుల అవసరం నిమిత్తం వృద్ధాశ్రమ నిర్వాహకులు పి.ఉదయ్ కుమార్‌కు ఈ దుస్తులు అందజేశారు.

జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి

సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లాను విశాఖపట్నం జిల్లాతో సమానంగా అభివృద్ధిలో నిలిపేందుకు అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్, భూగర్భగనుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా సమీక్షా కమిటీ సమావేశం రవీంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన అభివృద్ధి, నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో గుంతలు మరమ్మతు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. మార్చి నెలాఖరులోగా నిధులు ఖర్చుచేయవలసి ఉన్న దృష్ట్యా అభివృద్ధి పనులకు సంబంధించి దగ్గర నుండి, టెండర్లు, పనులు పూర్తయ్యేవరకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. జిల్లాను వ్యవసాయంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు నియోజకవర్గ స్థాయిలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రతి మండలంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, జెడ్‌పి చైర్‌పర్సన్ జె.సుభద్ర, జిల్లాలోని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, కెఎస్ఎన్ఎస్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డిఆర్ఒ సత్యనారాయణ రావు, ఆర్‌డిఒలు జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

ఘనంగా అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బొడ్డేడ ప్రసాద్, వైసిపి నేతలు

ప్రజాశక్తి-మునగపాక : వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ జన్మదిన వేడుకలు స్థానిక మెయిన్ రోడ్‌లోని వైకాపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వైకాపా నాయకులు కేక్ కట్ చేసి అమర్నాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బొడ్డేడ ప్రసాద్, ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, సర్పంచులు కాండ్రేగుల నూకరాజు, బీశెట్టి గంగ అప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, చదరం గణేష్ నాయుడు, ఎంపీటీసీ మద్దాల వీరు నాయుడు, వైకాపా నాయకులు కోనపల్లి రామ్మోహన్‌రావు, ఆడారి కాశీబాబు, పెతకంశెట్టి రామ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు పెందుర్తి నియోజకవర్గం వైసీపీ నాయకులు గండి రవికుమార్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రవికుమార్ అమర్నాథ్ స్వగృహానికి బుధవారం వెళ్లి పుష్ప గుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వైసిపి సబ్బవరం మండలం యువజన విభాగం అధ్యక్షులు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, ఐడి బాబు, దేముడుబాబు, కరక రాము, గురి శ్రీనివాస్, బత్తిన వెంకట్, గండి రవికుమార్ యువ సైన్యం పాల్గొన్నారు.

గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ములకలపల్లి గ్రామంలో మరిడిమాంబ ముత్యమాంబ అచ్చమ్మ తల్లి పేరంటాళ్ల తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, చామంతుల వెంకన్న దొర, చామంతుల సన్యాసిరావు, తమరాన త్రినాథ్, సంజీవి, కొమర బాబురావు, పాసిల కృష్ణ పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని మొగలిపురం, గాలిభీమవరం, పైడివాడ గ్రామాలలో సీతారాముల తీర్థ మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మొగలిపురంలో వైసిపి పెందుర్తి నియోజకవర్గం నాయకులు గండి రవికుమార్ ఆధ్వర్యాన గాలి భీమవరంలో సర్పంచ్ గొర్లి రాజేష్ ఆధ్వర్యాన, పైడివాడలో గ్రామ సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, ఆలయ కమిటీ ఆధ్వర్యాన తీర్థ మహోత్సవాలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీనివాస్, గోతిరెడ్డి అమ్మతల్లి, పైల రామునాయుడు, గండి రవికుమార్ యువ సైన్యం పాల్గొన్నారు.

నేడు, రేపు సత్యనారాయణమూర్తి తీర్థం

దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో ఈ నెల 23, 24 తేదీలలో శ్రీవిజయ వెంకట సత్యనారాయణ మూర్తి స్వామి తీర్థ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద అన్నసంతర్పణ ఉందని, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.



సీతారాములవారిని దర్శించుకున్న వైసిపి నేత గండి రవికుమార్



సారె ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవంలో భాగంగా బుధవారం ఆలయం వద్ద ఉత్సవ కమిటీ అధ్యక్షులు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ఆధ్వర్యంలో కొణతాల నూకమహాలక్ష్మీనాయుడు దంపతులు, పోలిమేర రవి దంపతులచే గౌరీ పరమేశ్వరుల వార్షిక కళ్యాణం నిర్వహించారు. గౌరీపరమేశ్వరుల కళ్యాణం విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించిన అనంతరం అంగరంగ వైభోగంగా కళ్యాణం జరిపించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు జరిగిన భారీ సారె ఊరేగింపును జనసేన పార్టీ నాయకులు భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ప్రారంభించారు. తీన్మార్, బ్యాండ్, సన్నాయిమేళం, తోడుపెద్దు సేవ వంటి మేళతాళాలు, డిజె దరువుల సందడిలో వేలాది మంది యువకులు పాల్గొన్నారు. సతకం పట్టు నుండి సంతబయల, చింతావారి వీధి, మెయినురోడ్డు, పార్కు జంక్షన్ మీదుగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహాలక్ష్మి నాయుడు, ఆలయ ప్రతినిధులు కొణతాల మురళీకృష్ణ, పివి.రమణ, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ, పెంటకోట జగన్, సూరిశెట్టి నర్సింగరావు, బుద్ధ భూలోకనాయుడు, కొణతాల కృష్ణంరాజు, కాండ్రేగుల శ్రీను, కెఎం. నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెం వార్డులో 60 మంది పేదలకు ఎక్స్ఎల్ కంపెనీ చైర్మన్ అశ్విన్‌ప్రాప్ బుధవారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. 1990లో సంభవించిన తుఫాన్ వరద తాకిడికి శిథిలావస్థకు చేరుకున్న దేవాలయం పునర్నార్మాణాన్ని రామకృష్ణ మిషన్ సహకారాలతో ఎక్స్ఎల్ కంపెనీ ఆర్థిక సహాయంతో చేపట్టారు. పునరుద్ధరించిన దేవాలయాన్ని, కొత్తపాలెం గ్రామాన్ని మరిచి పోకుండా 35 తర్వాత తన పుట్టిన రోజు సందర్భంగా ఎక్స్ఎల్ కంపెనీ చైర్మన్ అశ్విన్‌ప్రాప్ సందర్శించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎ.భాస్కరరావు, కంపెనీ జనరల్ మేనేజర్ అజయ్‌పాసే, హెచ్ఆర్ రాజవేణి, పెద్దలు కౌన్సిలర్ రాపేటి సంతోష్, అప్పారావు, దాడి వీరునాయుడు, రాపేటి సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు-2025 సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన స్థానిక వివేకానంద విద్యాసంస్థల డిగ్రీ, జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు జాతీయ రహదారి భద్రత గురించి నినాదాలు చెబుతూ కళాశాల దగ్గర నుండి కొత్తూరు నాలుగు రోడ్లు జంక్షన్ వరకు, తిరిగి కళాశాల వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజు గోవిందరావు మాట్లాడుతూ యువత వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పూసర్ల సంతోష్ కుమార్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ అదత్రావు రామారావు, చీపురుపల్లి దేవుడు నాయుడు, వేచలపు అర్జున రావు, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధులు ప్రసన్నకుమార్ వినయ్ కుమార్, జ్ఞాన దీపు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ తదితరులు

ప్రజాశక్తి 7
గురువారం 23 జనవరి 2025

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు


కొత్తకోటలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి - చీడికాడ: పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కురచా జయమ్మ కోరారు. మండలంలో అప్పలరాజు పురంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం గ్రామ సర్పంచ్ చుక్క అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ శిబిరాన్ని ఎంపిపి జయమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ పశు వైద్య శిబిరాలు ఈనెల 31 వరకు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఖండివరం పశు వైద్యాధికారి గణేష్ రెడ్డి, నాయకులు కురచా సురేస్, కొరచా మోది నాయుడు, కాళ్ల నాయుడు, వెటర్నరీ అసిస్టెంట్ పాత్ర పల్లి సంతోష్ పశుసంవర్ధక సహాయకులు ఎం. శ్రీనివాసరావు, రమేష్, రమేష్ పాడి రైతులు పాల్గొన్నారు

రోలుగుంట: ప్రభుత్వం విడుదల చేస్తున్న లింగ క్రమబద్ధీకరించిన వీర్యాన్ని (సెక్స్ స్టార్టెడ్ సెమెన్) పాడే రైతులు ఉపయోగించాలని బుచ్చింపేట పశు వైద్యురాలు బాలమౌనిక సూచించారు. పశు ఆరోగ్య శిబిరాన్ని మండలంలో శరభవరం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పంచాడ చంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్స్ స్టార్టెడ్ సెమెన్ రైతులకు సబ్సిడీపై ప్రభుత్వ అందిస్తుందని, దీంతో 99 శాతం ఆడ పెయ్యిలు పుడతాయన్నారు. నట్టల నివారణ మందులను అందజేశారు.

నర్సీపట్నంటౌన్: మండలంలోని గురందరపాలెం పంచాయితీలో పశువైద్య శింబిరం నిర్వహించారు. నర్సీపట్నం సహాయ సంచాలకులు రాంబాబు నట్టలు నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 31 వరకు మండలంలో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పెదబాబులు, చెట్టుపల్లి పశువైద్యాధికారి పుష్ప, గోపాల మిత్ర నాయడు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో అన్నవరం, సుర్ల వారిపాలెంలో పశు శిబిరాలు ఏర్పాటు చేశారు. పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో పాడిపశువులకు నట్టల నివారణ మందులు, గర్భకోశ చికిత్సలు చేశారు.

కొత్తకోట: రావికమతం మండలం కన్నంపేట గ్రామంలో పశు వైద్యులు బాల తేజ, నూకేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ సార్థ్యంలో జరిగిన ఈ శిబిరంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమలో వైస్ ఎంపిపి దంట్ల వెంకటరమణ , గ్రామ సర్పంచ్ దంట్ల సత్యవతి, టిడిపి నాయకులు దంట్ల రాజేష్ ,పశు సంవర్ధక శాఖ సహాయకులు జనార్ధన్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెంలో బుధవారం పశు ఆరోగ్య శిబిరాన్ని బుధవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి ఎం.డయానా, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అలాగే మండలంలో నర్సింగబిల్లిలో పశువైద్యాధికారి డాక్టర్ చైతన్యమణి ఆధ్వర్యాన పశువులకు గర్భ కోశ చికిత్సలు, 40 పెయ్యలకు నట్టల నివారణ మందులు, 18 పశువులకు సాధారణ చికిత్సలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోన అరుణ నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి మజ్జి నిరంజన్ కుమార్, కూటమి నాయకులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బోను దేముడమ్మ గంగునాయుడు, మాజీ ఎంపీపీ గండి దేముడు ప్రారంభించారు. ఈ శిబిరంలో 22 పశువులకు వైద్య పరీక్షలు, 23 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 10 పశువులకు చూడి తనిఖీలు, 48 దూడలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేసినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ బి.సంధ్య తెలిపారు. కార్యక్రమంలో అంతకాపల్లి పశు వైద్యాధికారి జి.అరుణ, విఏ లక్ష్మణరావు, పశు సంవర్ధక శాఖ సహాయకులు ఎ.రమేష్, డి.రమేష్, దేముడుబాబు, ఎంపిటిసి గొర్లి కనకరాజు, సబ్బవరపు రవి, సత్యం పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడిలో పశువైద్య శిబిరంలో 32 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెదరెడ్ల మాణిక్యం, ఎంపీటీసీ గొంపా చిన్నబాబు, పశు వైద్యాధికారి వై.ఉమామహేశ్వరి, మాజీ ఎంపీటీసీ గున్నబతుల శ్రీనివాసరావు, పాల సంఘం అధ్యక్షులు మమ్మిన సూర్యనారాయణ, సేనాపతి శ్రీనివాసరావు, పెదిరెడ్ల రాజు, ముమ్మిన నాగరాజు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేటలో పశు ఆరోగ్య శిబిరంలో ఎం.అలమండ పశువైద్యాధికారి కెహెచ్‌పి మంజూషారాణి పశువులకు గర్భ కోశ వ్యాధులకు చికిత్స, నట్టల నివారణ మందు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జక్కాన సింహాచలమ్మ, ఎంపీటీసీ వంటాకు పైడితల్లమ్మ పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో పశు సంవర్ధకశాఖ అదనపు డిప్యూటీ డైరెక్టర్ పి.మోహినికుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దూడలకు నట్టల నివారణ మందులు క్రమం తప్పకుండా వేయించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించడం ద్వారా సీజనల్ వ్యాధులు నుంచి పశువుల్ని కాపాడుకోవచ్చన్నారు. శాస్త్రీయ పద్ధతిలో పశుపోషణ, యజమాన్య విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.ఈ సందర్భంగా 25 లేగ దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. 46 పశువులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి, కొన్నింటి పేడ, రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు తరలించారు. స్థానిక ప్రాథమిక పశు వైద్యాధికారి డాక్టర్ పి. అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


గుంతలు పూడ్చుతున్న కూలీలు

రోడ్డుపై గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి-గొలుగొండ: నర్సీపట్నం - కృష్ణదేవిపేట ప్రధాన రహదారిలో ఏర్పడ్డ గుంతలను ఆర్అండ్‌బి అధికారులు పూడ్చి వేత చర్యలను బుధవారం చేపట్టారు ఇందులో భాగంగా నర్సింగపల్లి, కొత్తజోగంపేట వద్ద ఏర్పడ్డ గుంతలను పూడ్చివేశారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెగి పడిన విద్యుత్ తీగలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్.పురం బీసీ కాలనీలో బుధవారం పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలు తెగి జనావాసాలపై పడటంతో అక్కడ ప్రజలు భయంతో పరుగులు తీశారు. కొన్నాళ్లుగా విద్యుత్ తీగలు ఇళ్లపై వేలాడుతున్నాయంటూ సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఈ ప్రాంతీయులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని కోరుతున్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న గ్రామస్తులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని జానకయ్యపేట గ్రామానికి చెందిన ధూళి అప్పలరాజు ఇటీవల అకస్మాత్తుగా మరణించారు. ఈ మేరకు గ్రామ యువకులు, పలువురు పెద్దలు, వార్డు మెంబర్లు కలిసి రూ.51,500 నగదును సమకూర్చి, బుధవారం తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కురందాసు నూకరాజు, గ్రామ వైస్ ప్రెసిడెంట్ నానాజీ, యువకులు చేతుల మీదుగా మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డ్ మెంబర్ లు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తు నాయకులు

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గొలుగొండ: అంజనాదేవి చారిటబుల్ ట్రస్ట్ రూపొందించిన 2025 నూతన క్యాలెండర్‌ను జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆవిష్కరించారు. బుధవారం గొలుగొండలో ట్రస్ట్ అధ్యక్షులు పినపోతుల నాగు, కొత్తకోట రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ, అంజనా దేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నర్సీపట్నం నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లాడ సురేష్, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీతో గ్రామాలాభివృద్ధి


ప్రజాశక్తి -రావికమతం: ఉపాధి హామీ పనులతో గ్రామ ప్రజలకు ఉపాధి దొరకడమే కాకుండా గ్రామాభివృద్ధికి కూడా ఎంతో దోహద పడుతుందని మరుపాక ఎంపీటీసీ ముచ్చ సూర్యనారాయణ అన్నారు. మండలంలో మరుపాక గ్రామంలో బుధవారం చెరువు పూడిక తీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.గ్రామంలో ఉన్న ఎలగబంధ చెరువు పూడికతీతకు 10 లక్షల రూపాయలు ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాంబాబు, మాజీ మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ సత్తిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున నాయకులు

కొల్లు రవీంద్రను కలిసిన కాశీనాయుడు

ప్రజాశక్తి- కోటవురట్ల: జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొల్లు రవీంద్రను అనకాపల్లి జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కాశి నాయుడు బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించి పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు.


సన్మానిస్తున్న కాశీనాయుడు

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా లక్ష్మీదేవి

ప్రజాశక్తి - చీడికాడ: మండల తహసీల్దార్ ఉద్యోగ విరమణ పొందడంతో చీడికాడ మండల ఇన్‌చార్జి తహసిల్దారిగా లక్ష్మీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, దేవరాపల్లి మండల తహసిల్దారిగా విధులు నిర్వహిస్తున్న తనను చీడికాడకు ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు అధికారులను సమన్వయం చేసుకుంటూ రైతులకు భూ సమస్య, విద్యార్థులకు ధ్రువపత్రాలు సాధ్యమైనంత అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తానని ఆమె తెలిపారు.



బల్క్ డ్రగ్స్ పార్క్‌ను ఏర్పాటు చేయొద్దు

ప్రజాశక్తి -నక్కపల్లి: పర్యావరణానికి, ప్రజలకు హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేసారు. మండలంలోని రాజయ్యపేటలో బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు చేపడుతున్న పనులను బుధవారం సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాజాన దొరబాబు మాట్లాడుతూ, ప్రజల మనోభావాలు, ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ పార్క్‌ను ఎటువంటి పరిస్థితులల్లోనూ ఏర్పాటు చేయకూడదన్నారు. ప్రజా వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఏర్పడిన హెటిరో డ్రగ్స్ రసాయన కంపెనీతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే మరో బల్క్ డ్రగ్ తీసుకువచ్చి ఈ ప్రాంతం ప్రజానీకం ఆరోగ్యాలు, ప్రాణాలు, మత్స్యకారుల ఉపాధి దెబ్బతీయటానికి ప్రభుత్వం పూనుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు

జివిఎంసి కమిషనర్ బదిలీ బాధాకరం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:బదిలీ ఒక పక్క బాధగా ఉందని, మరోపక్క జివిఎంసి కమిషనర్ డైరెక్టర్ (మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) గా ప్రమోషన్ పొందినందుకు సంతోషంగా ఉందని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి. వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ సంపత్ కుమార్ జివిఎంసిలో సమస్యల పరిష్కారం ఒక గాడిన పడుతున్న సమయంలో, ఆయనకు బదిలీ కావడం కార్మికులకు ఇబ్బంది, నష్టం జరిగిందన్నారు. సిడిఎంఎ గా అదే మున్సిపల్ విభాగంలో అధిపతిగా వెళ్లడం సంతోషంగా ఉందన్నారు. ఒకపక్క కార్మికులు, ఉద్యోగులు , రెండో పక్క పాలకవర్గాన్ని సమన్వయం చేసిన సంపత్ కుమార్ సేవలకు ధన్యవాదములు తెలిపారు.

స్కూల్‌లో సోలార్ ప్యానెల్ ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: పాత నగరం 39వ వార్డు పరిధిలో పాత లక్ష్మీ టాకీస్ ప్రాంతంలో ఉన్న ఎంవిడిఎం పాఠశాలలో రూ.4 లక్షలతో వేదాంత కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్‌ను ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక విధిలో అనేక కార్యక్రమాలు చేస్తున్న వేదాంత ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఎం విడిఎం స్కూల్‌తో పాటు ఉమెన్స్ కళాశాల మిగిలిన పాఠశాలలో కూడా పలు సేవా కార్యక్రమాలను వేదాంత సంస్థ చేపట్టాలని కోరారు. వేదాంత సీఈవో సతీష్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్, జనసేన పార్టీ సౌత్ ఇంచార్జ్ శివప్రసాద్ రెడ్డి, వేదాంత కంపెనీ సిఎస్ఆర్ హెడ్ లక్ష్మి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న త్రిమూర్తులురెడ్డి

సైన్స్ వీడియో పోటీల్లో పాల్గొనాలి

-జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు రెడ్డి

ప్రజాశక్తి-గొలుగొండ:జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న సైన్స్ వీడియో పోటీలలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు రెడ్డి కోరారు. బుధవారం గొలుగొండ మండలంలో ఏఎల్.పురం, కె.మల్లవరం, గొలుగొండ, జోగంపేట తదితర గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో పోటీల పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో సైన్స్ ప్రయోగాలు పూర్తి స్థాయిలో చేయకపోవడంతో విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచింపలేక పోతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్ ప్రయోగ పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలన్నారు.



కంటిపి పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో శంకుపూరు గ్రామంలో బుధవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండల జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కాశీ లక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. 53 మందికి పరీక్షలు నిర్వహించి 30 మందిని కంటి ఆపరేషన్కు ఎంపిక చేశామని ఆప్తాలమిక్ జాక్సన్, ఫౌండేషన్ కోఆర్డినేటర్ అశ్విని కుమార్స్టాప్ అనిత పాల్గొన్నారుత

స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడంతోనే సరికాదని, ఈనాటికీ ప్రైవేటీకరణ ముప్పు కొనసాగుతుందని పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కె.ఎం కుమార మంగళం అన్నారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ నష్టాలకు ప్రధాన కారణం సొంత గనులు లేక పోవడమే అన్నారు. దేశంలోని అన్ని స్టీల్ ప్లాంట్లకు సొంత గనులు ఉన్నప్పటికీ, విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంతగనులు లేకపోవడం అన్యాయమన్నారు. తక్షణం సొంత గనులు కేటాయించాలన్నారు. ఉద్యోగులకు బకాయి ఉన్న జీతాలను చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపును రద్దు చేయాలని, విఆర్ఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.వి త్రినాథ్, పీతల అప్పారావు, జి.పోలే శ్వరరావు,ఎం. సూరీడు, జి.వి.ఎన్ చలపతి, సిఫ్ టియుఐ జిల్లా నాయకురాలు ఎం. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

పిల్లల ఆధార్ నమోదును పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:జిల్లాలో 0-6 ఏళ్లలోపు పిల్లల ఆధార్‌ను నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హరీందర్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డిస్ట్రిక్ లెవెల్ మోనిటరింగ్ కమిటీ సమావేశ మందిరంలో ఆధార్ డిఎల్ఎంసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 0-6 ఏళ్లలోపు మంది చిన్నారులకు గాను ఇప్పటి వరకు 7100 పిల్లలకు ఆధార్ పూర్తయిందని తెలిపారు. ఇంకా పెండింగ్‌లో వున్న పిల్లల ఆధార్‌ను నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. 18 ఏళ్లు నిండి ఆధార్ లేని వారు కూడా పొందాలన్నారు. ప్రతి సచివాలయం,తహశీల్దార్ కార్యాలయం, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆధార్ నమోదుకు ఎంత మొత్తం వసూలు చేయాలి,ఆధార్ సేవా కేంద్రాలలో తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ తదితరాలకు సంబంధించిన పోస్టర్‌లను ప్రదర్శించాలని తెలిపారు. ఈ సమావేశం లో కమిటీ కన్వీనర్, డిస్ట్రిక్ట్ ఇంచార్జి ఆఫీసర్ సి.ఉషారాణి, ప్రాజెక్ట్ మేనేజర్ జావీద్, జిల్లా విద్యాశాఖా అధికారి ఎన్. ప్రసన్న కుమార్ , జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ పి జగదీశ్వరరావు, జిల్లా పరిషత్ సిఈవో పి నారాయణమూర్తి, ఐసిడిఎస్ పిడి,జిల్లా కమీషనర్ అఫ్ పోలీసు, పోస్టల్, బిఎస్ఎన్ఎల్, ఆధార్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న ఛైర్మన్

పాఠశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి కంచె నిర్మాణం చేశారంటూ బుధవారం తహసిల్దార్ తిరుమల బాబుకు పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ తుమ్మల శ్రీనివాస్, ఇంచార్జ్ హెడ్ మాస్టర్ నారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు, ఈ సందర్భంగా తిరుమల బాబు మాట్లాడుతూ, స్థలాన్ని పరిశీలించి ఆక్రమణకు గురైతే చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయానికి బీరువా వితరణ

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని ఎం కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ అమ్మవారికి మాడుగుల గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపార వర్తకులు అనకాపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు శ్రీనాథ శ్రీనివాసరావు, పరమేశ్వరి దంపతులు బీరువాను బుధవారం ఆలయ కమిటీ ఛైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నూతి గట్టు నాగ శంకర్, పడాల అప్పలనాయుడు, జల్లి హరిప్రసాద్, చిరంజీవి, సిరా రాజు, వెంకటరాజు పాల్గొన్నారు.

క్వారీ లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట గ్రామానికి చెందిన నవతరం యువత ఆధ్వర్యంలో బుధవారం క్వారీ లారీలను అడ్డగించారు. ఈ గ్రామం నుండి తరచూ బండరాళ్లతో వాహనాలు తరచూ రాజన్నపేట, వడ్డిప క్వారీల నుండి బుచ్చంపేట గ్రామం నడిబొడ్డు నుంచి ప్రయాణం చేస్తున్నాయి. భారీ యంత్రాలు ప్రయాణించడంతో దుమ్ము దూళి ఎక్కువ కావడంతో పాటు కల్వర్టులు దెబ్బతింటున్నాయని యువకులు తెలిపారు. దీనిపై అదికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి -చింతపల్లి: స్థానిక హిందూ శ్మశాన వాటికకు మట్టి రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, త్వరలోనే ఆ పనులు ప్రారంభిస్తామని స్థానిక మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ సర్వ సభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి లేవనెత్తిన ఈ సమస్యపై స్పందించిన ఏపీఓ రాజు వైకాపా అల్లూరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిందాడ అప్పారావులతో కలిసి స్థానిక శ్మశాన వాటికను సందర్శించారు. ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు కిలో మీటరు రహదారికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. అనంతరం ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి మాట్లాడుతూ, శ్మశాన వాటికకు రక్షణ గోడ లేకపోవడంతో కబ్జాకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమరాజు, దారబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పర్యటిస్తున్న స్పీకర్

బీహార్‌లో స్పీకర్ పర్యటన

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: బీహార్ రాష్ట్రంలోని ప్రసిద్ధ బోధ్ గయా ప్రాంతాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి, ఉప స్పీకర్ కె. రఘురామకృష్ణరాజు కుటుంబం సందర్శించారు. ప్రపంచ ప్రసిద్ధ మహాబోధి ఆలయం ప్రాంగణంలో పర్యటించి పూజలు చేశారు. బుద్ధుడు బోధి వృక్షం కింద ధ్యానం చేశారు.

తీర్థాల్లో జోరుగా కోడిపందేలు

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలో పలు గ్రామాల్లో జరుగుతున్న తీర్థాల్లో బళ్లాటలు, కోడిపందాల ఆటలు జోరుగా సాగుతున్నాయి. గత కొద్దిరోజులుగా మండలంలో కేజే పురం, గొట్టివాడ అగ్రహారం, జంపన, పొంగలిపాక, సత్యవరం, జమ్మిదేవి పేట, వమ్మలి, ఓకే శ్రీరాంపురంలో నిర్వహించిన గ్రామ దేవతల తీర్థాలలో బల్లాటలు, కోడిపందాలు యథేచ్ఛగా నిర్వహించారు. అలాగే బుధవారం శ్రీరాంపురం గ్రామంలో జరిగిన రాములు వారి తీర్థం, వమ్మలి గ్రామంలో జరిగిన మోదమాంబ తీర్థాల్లో కోడిపందెలు బహిరంగ జరిగాయి. దీంతో అక్కడ కొంతమంది యువత ఫోటోలు, వీడియోలు తీసి విలేకరులకు సమాచారం అందించారు. పందేలాట కారణంగా యువత బెట్టింగులు కాస్తూ భారీగా నష్టపోతున్నారు. కొంతమంది మద్యం మత్తులో ఇళ్లలో వస్తువులను కూడా తీసుకువచ్చి తాకట్టు పెట్టి జూదం ఆడి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. కోడిపందాలు, బల్లాటలో భారీ ఎత్తున సొమ్మును సంపాదించవచ్చునని భావించిన యువత తల్లిదండ్రులకు తెలియకుండా కూడా ఇళ్లల్లో నగదును తీసుకువెళ్లి ఆడుతున్నారు. ఇవి జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ అమలకు నోచుకోలేదు. గొలుసు దుకాణాలను ఏర్పాటు చేసి అర్ధరాత్రి వరకు కూడా విక్రయాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం బెల్ట్ దుకాణాలు నిర్వహించకూడదని, ఇందుకు గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ అధికారులు మాత్రం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువరు కోరుతున్నారు.



తీర్థంలో కోడి పందేలు